ప్రజాశక్తి

శనివారం 27 ఏప్రిల్ 2024 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

మండే ఎండలు... కాలే కడుపులు..!

ఏటేటా తగ్గుతున్న ఉపాధి పనుల 'బడ్జెట్'
గత ఆరేళ్లుగా నీడా, నీరూ కరువే
సమ్మర్ అలవెన్సులు ఎత్తేసిన కేంద్రం
రెండుపూట్ల మస్టర్ వద్దంటున్న కూలీలు

ఆర్థిక సంవత్సరం	ఉపాధి పనుల కల్పన (రూ.)
2020-21లో	రూ.13 కోట్ల 39 లక్షలు
2021-22లో	రూ.10 కోట్ల 97 లక్షలు
2022-23లో	రూ.9 కోట్ల 58 లక్షలు
2023-24లో	రూ.8 కోట్ల 73 లక్షలు

మండుటెండలోనే కూలీల ఉపాధి పనులు

ప్రజాశక్తి-తొట్టంబేడు

గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఏడాదికి వంద రోజుల పని కల్పించడం ద్వారా సామాజిక, ఆహారభద్రతను పెంపొందించాలన్న గొప్ప సంకల్పం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానిది. ఆనాడు వామపక్ష పార్టీలు చేపట్టిన ఉద్యమాల ఫలితంతగా 2005లో ఈ పథకం పురుడు పోసుకుంది. అయితే ఈ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రమక్రమంగా నీరుగారుస్తోంది. ఉపాధి కూలీలు తెల్లారే వచ్చి ఉదయం 10 గంటకల్లా వెళ్లిపోయే వెసులుబాటు ఉన్నా రెండు పూటలా మస్టర్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. ఉపాధి పనులు జరిగే చోట కనీసం నీడ, నీరు, ప్రథమ చికిత్స పెట్టె ఎక్కడా అందుబాటులో ఉండటం లేదు. వేసవిలో ఉపాధి కూలీలకు అందాల్సిన 30శాతం అలవెన్స్‌నూ కేంద్రం కోత పెట్టింది. పార, గడ్డపార, తట్ట, బుట్టకిచ్చే అదనపు కూలికి ఎసరు పెట్టింది. మండే ఎండల్లో కాలే కడుపులతో కూలీలు దయనీయంగా ఉపాధి పనులు చేస్తుండటం 'ప్రజాశక్తి' పరిశీలనలో కనిపించింది.

తొట్టంబేడు మండలంలో 8,762 జాబ్‌కార్డులున్నాయి. వీరిలో 50 శాతం మాత్రమే ఉపాధి పనులకు వెళుతున్నారు. అయితే మండు వేసవిలో పని ప్రదేశాల్లో నీడ, నీరు, ప్రథమ చికిత్స పెట్టె ఎక్కడా కానరాని పరిస్థితి. గత ఆరేళ్లుగా ఇవ్వడం లేదని ఉపాధి కూలీలు వాపోయారు. సాధారణంగా ఉపాధి హామీ పనుల్లో నీటి వనరులు, భూసార, పర్యావరణ పరిరక్షణ, కరువు నివారణ, వరద నియంత్రణ, అడవులు, చెట్ల

2లో

రైతుల మోములో ఆనందం

క'(ని)మ్మ'ని ధర

ప్రజాశక్తి- దక్కిలి

ధర ఉంటే కాయ ఉండదు... కాయ ఉంటే ధర ఉండదు... ఈ చేదు నిజం రైతు గుండెల్ని పిండిచేస్తోంది.. మండలంలో సుమారు 3వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో నిమ్మ ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో నిమ్మ సాగు చేసే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వెంకటగిరి , గూడూరు నిమ్మ మార్కెట్లలో నిమ్మకాయలు కేజీ ధర నాణ్యతను బట్టి రూ 60 నుంచి రూ 120 వరకు పలికింది. మండలంలో నిమ్మ సాగు చేసే రైతులు తమ దిగుబడులను గూడూరు , వెంకటగిరి నిమ్మ మార్కెట్లకు తరలిస్తుంటారు. సాధారణంగా నిమ్మ ధరలు మార్చి ఏప్రిల్ , మే, మాసాల్లో ఆశాజనకంగా ఉంటాయి. అయితే గత నెల చివరి వారంలో హోలీ పండుగ నేపథ్యంలో ధరలు తగ్గి 20 రోజులుగా అంతంత మాత్రం గానే ఉన్నాయి. నాలుగు రోజులుగా ధరలు రోజురోజుకూ పెరిగి శుక్రవారం మంచి నాణ్యత కలిగిన నిమ్మకాయలు కేజీ రూ 120 పలికింది. ఈ ప్రాంతం నుంచి 40 కేజీల బస్తాల్లో రైతులు గూడూరు, వెంకటగిరి నిమ్మ మార్కెట్లకు తమ దిగుబడులను ఎగుమతి చేస్తుంటారు. ఆ బస్తా రూ ఐదు వేల వరకు రావడంతో రైతులకు పెరిగిన ధరలు ఊరటనిస్తున్నాయి. తోటలో దిగుబడి అంతంతమాత్రంగానే ఉండడం, గణనీయంగా పెరిగిన ఎండల ప్రభావంతో మైట్స్ వంటి తెగుళ్ల ఉధతి, పెరిగిన సాగు ఖర్చుల నేపథ్యంలో ప్రస్తుతం పెరుగుతున్న ధరలు నిమ్మ సాగు చేసే రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

'అగ్గి' రగిలితే 'అంతే'..!

సీజ్ వాహనాలకు మోక్షమెప్పుడో..!

శిధిలావస్థకు చేరిన సీజ్ అయిన వాహనాలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శేషాచలంలోని అరుదైన ఎర్రచందనం సంపదను దోచుకెళ్లడానికి స్మగ్లర్లు రవాణాకు అనుకూలమైన వాహనాలను సిద్ధం చేసుకుని రంగంలోకి దిగుతుంటారు. సిద్ధం చేసుకున్న వాహనాలలో లోడ్ చేసుకొని వారు అనుకున్న గమ్యానికి క్షేమంగా చేరే విధంగా వాహనాల ఫిట్నెస్ చూసుకొని మరీ ఎర్రచందనం అక్రమ రవాణా జరిపిస్తుంటారు. శేషాచలం అడవులలోని ఎర్రచందనం పరిరక్షణకు శ్రమించే అటవీశాఖ, ఎర్రచందనం పరిరక్షణ ప్రత్యేక కార్యాదళం (టాస్క్ ఫోర్స్) అధికారులు స్మగ్లర్ల ఎత్తుగడలను ఛేదించి తరలిపోతున్న ఎర్రచందనం దుంగలను శ్రమించి పరిరక్షిస్తుంటారు. ఈ క్రమంలో దుంగలను లోడ్ చేసే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తారు. అలా అధికారుల ద్వారా సీజ్ చేయబడిన వాహనాలు కోర్టులలో కేసులు పరిష్కారమై తీర్పు వచ్చేవరకూ వేలం వేయడానికి అనుమతి లేదు. ఇలా ఏళ్ల తరబడి సీజ్ అయిన వాహనాలు తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద గల అటవీశాఖ, టాస్క్ ఫోర్స్ కార్యాలయాలు, ఇతర అటవీ విభాగాల కార్యాలయాల సమీపంలో వందల్లో పడి ఉన్నాయి. ప్రస్తుతం ఈ వాహనాల పరిస్థితి దయనీయ దుస్థితికి చేరింది.

అగ్గి రాజుకుంటే అంతే సంగతులు.....

సీజ్ అయిన వాహనాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న అటవీశాఖ, టాస్క్ ఫోర్స్ కార్యాలయాల వద్ద పక్కపక్కనే నిలుపబడి ఉన్నాయి. ఏళ్ల తరబడి చెట్ల కింద ఉండడంతో చెట్టు నుండి రాలే ఆకులు వాహనాలపై, వాహనాల సమీపంలో పడి దట్టంగా పేరుకుపోయాయి. అసలే ఎండలు మండిపోతున్న తరుణంలో ఏదేని అనుకోని ప్రమాదంగా అగ్గి రాజుకుంటే ఇక ఈ సీజ్ అయిన వాహనాలు కాలి బూడిదవ్వక తప్పదు. ఇప్పటికే అడవిలో కార్చిచ్చులు ఏర్పడి హెక్టార్లకొద్దీ అటవీ భూభాగంలోని పచ్చని చెట్లు కాలి బూడిదవ్వడం మనం చూస్తున్నాం.

వాహనాల విడిభాగాలు కనుమరుగు....

స్మగ్లర్ల నుండి సీజ్ చేయబడిన వాహనాలకు విడిభాగాలు కనుమరుగవుతున్నాయి. వాహనం సీజ్ అయిన రోజు ఉన్న వాహన రూపు ఒకలా ఉంటే... నేడు వాటి విడిభాగాలు కనుమరుగై దర్శనమిస్తున్నాయి. సీజ్ చేయబడిన వాహనాల విడిభాగాలు ఎలా మాయమవుతున్నాయో అధికారులే చెప్పాలి. సీజ్ చేయబడిన వాహనం ప్రభుత్వానికి ఆస్తి వంటిది. ఆ వాహనం విడిభాగాలు

2లో

సంస్కృత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

స్నాతకోత్సవ సభలో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్

2లో

బిసివై పార్టీపై మళ్లీ దాడి

మాగాండ్లపల్లిలో ఉద్రిక్తత
కారు అద్దాలు ధ్వంసం
పోలీసుల ఏకపక్ష ధోరణి

వార్త సెంటర్‌స్ప్రెడ్‌లో..

(మొదటి పేజీ తరువాయి)

'అగ్గి' రగిలితే 'అంతే'..!

మాయమైతే ఒకవేళ వేలం వేసినప్పుడు ఆరోజు విలువబట్టి, వాహన దుస్థితి బట్టి వేలంలో ఆ వాహనం అమ్ముడుపోయే పరిస్థితి ఉంటుంది. ఇలా వాహనాలకు ఉన్న విడిభాగాలు కనుమరుగైతే ప్రభుత్వానికి చేకూరే ఆదాయం తగ్గిపోతుంది.

వాహనాల వేలం నిర్వహిస్తే....

సీజ్ అయిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తే లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. కానీ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ ఈ వాహనాలకు కోర్టులలో తీర్పు ద్వారా లైన్ క్లియర్ అయితే తప్ప వీటికి మోక్షం ఉండదు. అధికారులు సీజ్ అయిన వాహనాల పూర్తి రక్షణ పట్టించుకునే పరిస్థితి ఉండదు కనుక కోర్టులలో తీర్పులు త్వరతగతిన వెలువడేలా ప్రయత్నాలు చేస్తే తప్ప ఈ వాహనాలకు పట్టిన తుప్పు వదిలే ప్రసక్తి లేదు. ఇకనైనా ఆ దిశగా అధికారులు ముందడుగులు వేస్తారని ఆశిద్దాం.

బర్డ్, హృదయాలయ ఆస్పత్రులను పరిశీలించిన గవర్నర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రులను రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం సందర్శించారు. ముందుగా బర్డ్ ఆసుపత్రిని సందర్శించి, నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి, ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందుతున్న చికిత్స, ఐసియు, ఔట్‌పేషెంట్ విభాగం, ఆపరేషన్ థియేటర్లు, వార్డులను, డిజిటల్ ఎక్స్‌రే, సిటి స్కాన్, కృత్రిమ అవయవాల తయారీ, అమరిక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రి వార్డుల్లో గుండె జబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్‌ల్యాబ్, ఐసీయూ తదితర వార్డులను రాష్ట్ర గవర్నర్ సందర్శించి, రోగుల తల్లిదండ్రులతో మాట్లాడారు. నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు చేసి చిన్నారులకు టీటీడీ అందిస్తున్న సేవల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులు సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులను టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి రెడ్డప్ప రెడ్డి, శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

గవర్నర్‌కు సాదర వీడ్కోలు

తిరుపతిలోని బర్డ్, హృదయాలయ ఆస్పత్రుల సందర్శన అనంతరం శుక్రవారం సాయంత్రం రేణిగుంట రైల్వేస్టేషన్ చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు లభించింది. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు వీడ్కోలు పలికారు.

మండే ఎండలు... కాలే కడుపులు..!

(మొదటి పేజీ తరువాయి)

పెంపకంతో పాటు ఇతర గ్రామీణాభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేస్తుంటారు. ఇవన్నీ అత్యంత కష్టంతో కూడుకున్న పనులు. ఈ పరిస్థితుల్లో ఉపాధి కూలీలు రెండు పూట్ల పని చేస్తేనే హాజరు వేస్తామంటూ కేంద్రం చెప్పడం విమర్శలకు దారి తీస్తోంది. ఉదయం 9 గంటలకే ఎండలు సుర్రుమని, చేతులు, కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయనీ, మళ్ళీ మధ్యాహ్నమూ పని చేయమంటే ప్రాణాలపైకి తెచ్చుకోవడమేనని కూలీలు వాపోతున్నారు. గత వారం రోజులుగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎండ తీవ్రత ఎక్కువైంది 42 నుంచి 44 డిగ్రీల వరకు ఎండ కాస్తుంది. ఎండకు ఎండుతూ ..గొంతు ఎండుతున్న నీళ్లు లేక వడదెబ్బ సోకుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు జరిగే ప్రదేశం నుంచి గ్రామానికి దూరం కావడంతో నీళ్లు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం

గతంలో టీసీఎల్ ద్వారా రాష్ట్రం బిల్లులు చెల్లిస్తుండగా, ఇప్పుడు కేంద్రం జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలను నమోదు చేస్తూ ఎన్ఐసీ ద్వారా చెల్లింపులు చేస్తోంది. ఫలితంగా బిల్లులో జాప్యం జరుగుతోందంటూ ఉపాధి హామీ అధికారులే చెబుతుండడం గమనార్హం. సమ్మర్ లో ఉపాధి బిల్లులలో జాప్యం ఉండదని, రెండు వారాలకు ఒకసారి బిల్లులు పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రామచంద్రపురం గ్రామంలో మస్తానమ్మ గ్రూపులో 15 మందిని పనులకు పిలిపించి నెల రోజులు పనులు చేయించుకుని బిల్లులను గతంలో ఉన్న క్షేత్ర సహాయకుడు చెల్లించలేదు. ఆ బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని, ఆ బిల్లులు ఏమయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఇది జరిగి రెండు సంవత్సరాల గడుస్తున్నా ఏ అధికారీ పట్టించుకోకపోవడం శోచనీయం. శుక్రవారం తొట్టంబేడు పంచాయతీలోని రామచంద్రపురం గ్రామంలోని కచ్చేలగుంట చెరువులో ఉపాధి పనులను పరిశీలించగా కూలీలకు గిట్టుబాటు కూలి కల్పించలేదని వారు 'ప్రజాశక్తి'కి మొరపెట్టుకున్నారు.

మండలంలో క్షేత్ర సహాయకుల కొరత

తొట్టంబేడు మండలంలో 27 పంచాయితీలు ఉన్నాయి. అయితే ప్రధాన నాయకుని కనుసన్నల్లో ఈ ఉపాధి క్షేత్ర సహాయకులు పనిచేయాలి. వారి మాట వినకుంటే నిర్మొహమాటంగా తొలగిస్తారు. అందులో భాగంగా తొట్టంబేడు మండలంలో సుమారు 15 మందిని తొలగించారు. వారికి అనుకూలమైన వారిని విధుల్లో చేర్పించుకున్నారు. అయినప్పటికీ 12 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మండలంలో కొరతగా ఉంది . ఈ నాయకుల వల్ల ఉపాధి పనులకు వెళ్లాలంటే ఫీల్డ్ అసిస్టెంట్లు లేని పరిస్థితి మండలంలో నెలకొంది. ఉన్నతాధికారులు గుర్తించి ఉపాధి క్షేత్ర సహాయకులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి పనులే ఆధారం : ఆదెమ్మ

తొట్టంబేడు పంచాయతీ రామచంద్రాపురం గ్రామం. రెండేళ్ల క్రితం ఉపాధి పనులకు వెళ్లాను. అయితే అప్పట్లో ఉన్న క్షేత్ర సహాయకుడు నాలుగు వారాలు పని చేయించుకుని ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. అప్పటి నుంచి ఉపాధి పనులపై నమ్మకం పోయింది. ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ సర్ది చెప్పడంతో పనులకు వస్తున్నాను.

కాలే కడుపులతో పనులకు వెళ్లాం : బుజ్జమ్మ

మేం గిరిజనులం. ఉపాధి పనులకు వెళితే ఒక్కసారిగా డబ్బు వస్తుంది. ఇంటిలో సరుకులు తెచ్చుకోడానికి ఉపయోగ పడుతుందని వెళ్లేవాళ్లం. అయితే రెండేళ్ల క్రితం నెలరోజులు పనులు చేయించుకుని బిల్లులు ఇవ్వలేదు. పస్తులుండి పనులకు వెళ్లాం. పనులకు వెళ్లినా పస్తులుండాల్సి వచ్చింది.

ఎండకు తట్టుకోలేకున్నాం : నిర్మల

ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. తట్టుకోలేకున్నాం. పనులకు రాకపోతే పస్తుండాలి. చెమటలు కక్కుకుంటూ తట్టలు మోస్తున్నాం. ఇంటికి వెళ్లే సరికి నీరసం వస్తోంది. మాకు రూ.400 వచ్చేలా గిట్టుబాటు కూలి కల్పించాలి. ప్రస్తుతం ఇస్తామని చెబుతున్న 300 కూలీ మా ఖాతాల్లో జమ కాలేదు.

గిట్టుబాటు కూలి కల్పించండి : సుబ్రహ్మణ్యం

ఐదేళ్ల క్రితం వరకూ గడ్డపారకు, నీళ్లకు అదనంగా కూలి వచ్చేది. ప్రస్తుతం అవన్నీ రావట్లేదు. నిత్యావసర సరుకుల రేట్లు పెరిగిపోతున్నాయి. రూ.300 కూలి వస్తుంది అంటున్నారు. అది సరిపోదు. కనీసం రూ.500 ఇచ్చేలా చూడాలి. గడ్డ పారవేస్తే ఎండలకు చేతులు బొబ్బలెక్కుతున్నాయి. గిట్టుబాటు కూలి వచ్చేలా చూడాలి.

కనీస సౌకర్యాలు కల్పించాలి: పెనగడం గురవయ్య, సిపిఎం

ఉపాధి పనులు జరిగే చోట కనీస వసతులు లేవు. బడ్జెట్‌లో నిధులకు కేంద్రం కోత పెట్టింది. వంద రోజులు పూర్తయిన కుటుంబాలకు పనులు కల్పించడం లేదు. చేసిన వారికి బిల్లులు చెల్లించడం లేదు. సమ్మర్ అలావెన్స్ పూర్తిగా ఆపేసింది. కూలీలకు సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలి.

1919మంది కూలీలే పనుల్లో : సుజాత, ఎపిఒ

తొట్టంబేడు మండలంలో 8,762 జాబ్‌కార్డులు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1125 కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పించాం. ఈసారి 1488 కుటుంబాలకు త్వరలోనే వంద రోజులు పూర్తవుతుంది. ప్రస్తుతం మండలంలో 1919 మంది కూలీలు పనిచేస్తున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల ఈ ఏడాది కూలీల శాతం అధికంగా తగ్గింది. ఈ సంవత్సరం టార్గెట్‌గా వంద ఎకరాల్లో పండ్ల తోటలు అనుకున్నాం. ప్రస్తుతం 15 ఎకరాలను గుర్తించాం. చియ్యవరం, పిల్లమేడు మామిడిగుంట గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్ర సహాయకులు 15 మంది ఉన్నారు. ఐదు గ్రామాల్లో లేరు.

సంస్కృత వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి జిల్లా)

సంస్కృత వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ పిలుపునిచ్చారు. సంస్కృత వర్సిటీ మూడో స్నాతకోత్సవం విశ్వ విద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని వివిధ కోర్సులలో ఉపాధి సాధించిన 580 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 67 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ఇచ్చారు. వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ క్రిష్ణమూర్తి ముఖ్య అతిథి జగదీప్ ధన్కడ్‌కు, విశిష్ట అతిథి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి ఛాన్సలర్ గోపాలస్వామికి సాదర స్వాగతం పలికారు. మహోమహోపాధ్యాయ సాధు భద్రేశదాస స్వామి అనుగ్రహభాషణం చేశారు. విశ్వ విద్యాలయం ఛాన్సలర్ ఎన్.గోపాలస్వామి స్నాతకోత్సవాన్ని కులాధిపతిగా ప్రారంభించారు. వైస్‌ఛాన్సలర్ వివిధ కోర్సుల్లో ఉపాధి పొందిన 580 మంది విద్యార్థులకు ఉపస్థాపనం చేశారు. జగదీప్ ధన్కడ్ మాట్లాడుతూ సంస్కృత పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత్సహించడం ద్వారా సంస్కృత వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా, ఆధునిక విద్యా అవసరాల మధ్య అంతరాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. భారతీయ విజ్ఞాన వ్యవస్థలను తోసిపుచ్చే వలసవాద ఆలోచనా విధానం వల్ల ప్రధాన స్రవంతి విద్యలో సంస్కృతం ఏకీకరణకు ఆటంకం ఏర్పడిందన్నారు. పురాతన రాతప్రతుల సంరక్షణలో డిజిటల్ టెక్నాలజీల వినియోగంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఏ భాష అయినా సమాజం వినియోగించి, సాహిత్యం కూర్చినపుడే మనుగడ సాగుతుందన్నారు. సంస్కృతం పరివర్తనకు మార్గమని, అమూల్యమైన వారసత్వానికి విద్యార్థులు రాయబారులుగా మారాలన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కె.సాంబశివమూర్తి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ట్యూషన్ సెంటర్‌లో సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ భగత్‌సింగ్ ట్యూషన్ సెంటర్‌లో నిర్వహించే సమ్మర్‌క్యాంపును వేసవిలో పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఐద్వా, డివైఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. భగత్ సింగ్ ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ మే, జూన్ నెలల్లో సుందరయ్య నగర్ కమ్యూనిటీ హాలు, తిరుపతిలో ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుండి 8:30 వరకు నిర్వహించనున్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ .జయచంద్ర, జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఉపాధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ వేసవి సెలవులు అంటే బంధువులతో కలసి ఆట, పాట, కథలతో కాలక్షేపం చేసేవారని, నేడు వేసవి సెలవుల్లోనూ ఇళ్లకే పరిమితం అయిపోయి సెల్ ఫోన్లు, టి.వి ,వీడియో గేమ్‌లకు బానిసలవుతున్నారన్నారు. తిరుపతి భగత్ సింగ్ ట్యూషన్ సెంటర్‌లోనూ, బిటిఆర్ కాలనీలోనూ ఈ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. 28వ తేదీ ఆదివారం డ్యాన్స్, కరాటే, పాటలు, అందమైన చేతిరాత, క్విజ్, క్యారమ్స్, తెలుగు, ఇంగ్లీష్ తప్పులు లేకుండా రాయడం, చదవడం నేర్పిస్తారన్నారు. 15వేల ఇంగ్లీష్ పదాలు నేర్పిస్తారన్నారు. 9490300496 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- కలెక్టర్, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సార్వత్రిక ఎన్నికలు -2024 నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై సాధారణ అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకులు కలెక్టర్, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అందరూ కలిసి సమన్వయంతో ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ అన్ని విధాల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టిన ఎన్నికల సన్నద్ధత పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సెకండ్ ర్యాండమైజేషన్ ఆఫ్ పోలింగ్ సిబ్బంది ఏప్రిల్28, ఈవిఎం సెకండ్ ర్యాండమైజేషన్ ఆర్‌ఒ లతో మే1న, ఈవిఎం కమిషనింగ్ మే3న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టడం జరుగుతుందని టైం లైన్ షెడ్యూల్ మేరకు చేపడుతున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూం ల వద్ద సరిపడా సీసీ కెమెరా ఏర్పాటు, భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేపట్టామని, పిడబ్ల్యుడి, 85 సంవత్సరాల పైబడిన ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2140 పోలింగ్ కేంద్రాలలో 696 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధులు, బాధ్యతలు, పలు ఎన్నికల అంశాలపై బూత్ స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, సెక్టర్ అధికారులకు, పోలీస్ అధికారులకు, పోలింగ్ సిబ్బందికి తదితరులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ వివరిస్తూ ఎస్ఎస్టి, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, సీజర్ వివరాలు, సెబ్ వివరాలు తెలిపారు. ఎనిమిది అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు, 10 అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. నగదు, మద్యం, విలువైన లోహాలు, ఫ్రీ బీస్ తదితరాలు కలిపి జిల్లాలో సుమారు రూ.18.91 కోట్లు సీజ్ చేశామని తెలిపారు. సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు అందరూ కలిసి సమన్వయంతో చేపట్టాలని సూచించారు. వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులకు సంబంధించి ఎన్నికల నిబంధనల మేరకు నియోజక వర్గంలో ఎక్స్పెండీచర్, అబ్జర్వర్లు రికార్డ్ నిర్వహణ పక్కాగా ఉండేలా చూడాలని, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్,ఎస్టి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జెసి ధ్యాన చంద్ర హెచ్ఎం, అదితి సింగ్, నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా నోడల్ అధికారులు, పోలీస్, రెవెన్యూ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

ప్రజాశక్తి-సదుం, సోమల: మండల పరిధిలోని 79ఎ చింతమాకులపల్లి పంచాయతీ, కారేవాండ్లపల్లికి చెందిన బాలుడు ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన శుక్రవారం సదుంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. కారేవాండ్లపల్లికి చెందిన దెబ్బిడి మునివెంకట సిద్దులు, ప్రసన్న రెండవ కుమారుడు దెబ్బిడి భవిత్(13) వేసవి సెలవులు కావడంతో అమ్మమ్మ ఊరు ఎస్ నడింపల్లి, సోమల మండలానికి వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి శుక్రవారం ఈతకు వెళ్లాడు. ప్రమాద వశాత్తు నీటి కుంటలో పడి మునిగిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. భవిత్ మృత దేహాన్ని తల్లిదండ్రులు శుక్రవారం సదుం మండలం కారేవాండ్లపల్లికి తీసుకొచ్చారు. భవిత్ కలికిరి రాయలసీమ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇతని తల్లి ప్రసన్న కారేవాండ్ల పల్లిలో వార్డు మెంబరుగా వున్నారు. భవిత్ అన్న ముకేశ్ కుమార్ తిరుపతిలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువు తున్నాడు. ఎదుగు తున్న బిడ్డ ఇలా విగత జీవుడై కనబడుతుంటే ఆ తల్లి దండ్రుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగింది.

కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని కలగుంట గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు రాపూరు గోపాల్ (50) శుక్రవారం తాటి చెట్టుపై కల్లు తీస్తూ ప్రమాదవశాత్తు అక్కడి నుంచి పడి మృతి చెందాడు. గోపాల్‌కు వివాహమై ఇద్దరి పిల్లలు ఉన్నారు. పదేళ్ళగా కల్లు గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న సమయంలో తాటి చెట్టు పై నుంచి పడి మృతి చెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. గోపాల్ మృతితో భార్య పిల్లలు కన్నీరు మున్నీరయ్యారు. ఇంటికి జీవనాధారికి దిక్కుగా ఉన్న గోపాల్ మృతితో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురికి జరిమానా

ప్రజాశక్తి -సోమల: బైండోవర్ పరిధిలో ఉంటూ నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు వ్యక్తులను తహశీల్దారు ఎదుట హాజరు పరిచి ముగ్గురికి జరిమానా విధించి నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి 15వేల రూపాయల చొప్పున 30 వేల రూపాయలు, మరొక వ్యక్తికి పదివేల రూపాయల జరిమానా మొత్తం 40 వేల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వంటివి బైండోవర్లో ఉన్న వ్యక్తులు చేయకూడదని, అలా నిబంధనలను ఉల్లంఘిస్తే ఖచ్చితంగా జరిమానా విధించి తహశీల్దారు ఎదుట హాజరు పరుస్తామని, బైండోవర్లో ఉన్న వ్యక్తులు ఈ విషయాలను గమనించి సత్ప్రవర్తనతో మసలుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధిని కొనసాగిద్దాం..

- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: అభివృద్ధి, సంక్షేమం నిర్విరామంగా కొనసాగించడానికి, గడప వద్దకే ప్రభుత్వ సేవలను పొందడానికి జరగనున్న ఎన్నికల్లో ఓటేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంని చేద్దామని ఆ పార్టీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సాయంత్రం నారాయణవనం మండలం లోని అరణ్యకండ్రిగ, చిత్తూరుకండ్రిగ, ఈశ్వర వైసీ, పడివేటమ్మ వైసీ, వెత్తలతడుకు, వెత్తవతడుకు ఏఏబ్ల్యూ, చిరంజీవి ఎస్టీ కాలనీలలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింట మహిళలను పలకరించి తమను గెలిపించాలని అభ్యర్థించారు. తిరుపతి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దెల గురుమూర్తిని, సత్యవేడు ఎమ్మెల్యేగా తనకు మండలం నుండి మెజార్టీని తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలు పొత్తులు, కులసమీకరణలపైనే ఆధారపడి రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. అభివృద్ధే లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన అన్నారు. గతంలో చంద్రబాబు 600 హామీలు ఇవ్వడంతోపాటు, నూరు పేజీల మేనిఫెస్టో విడుదల చేసి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సామాజిక అభివృద్ధి, సంక్షేమం వైపు నడవాలంటే ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ముఖ్య నాయకులు అన్నాదొరై, సాయిరవి, వెంకటరమణ, కిరణ్, సుబ్రహ్మణ్యంయాదవ్, ప్రకాష్, వెంకటేష్, మనోహర్, ఫోడా మణి, హేమచంద్రారెడ్డి, ఆర్ముగం, ఏలుమలై, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర వైసిపి కార్యదర్శులు మొగశాల సోదరులు కృష్ణమూర్తి, రెడ్డెప్ప కోరారు. మండలంలోని తీర్థం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం మొగశాల సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట ప్రతి కుటుంబానికి ఐదు సంవత్సరాలు సంక్షేమ పథకాల లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో మళ్లీ వెంకటేగౌడను ఎమ్మెల్యేగా, ఎంపిగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపిటిసి రవీంద్రమ్మ , స్థానిక నాయకులు కేశవులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల కోసం సూపర్ సిక్స్ పథకాలు: గురజాల ప్రతిమ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: టిడిపి అధికారంలోకి వస్తే నే అభివృద్ధి సాధ్యమని గురజాల ప్రతిమ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని 30, 31, 32వ డివిజన్ల పరిధిలోని ఆశోకపురం, లాలు గార్డెన్, సీబీ రోడ్డు, పలమనేరు రోడ్డు, టెలిఫోన్ కాలనీ, రామ్ నగర్ కాలనీలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలతో కలిసి డివిజన్ల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఉమ్మడి పార్టీల మేనిఫెస్టో లోని పథకాలను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవటానికి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేయాలని, ప్రజలందరూ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రమీల ఆనంద్, కో ఆప్షన్ మెంబర్ కోలా కిరణ్, టిడిపి నేతలు సుధాకర్ నాయుడు, ఆనంద్, ఆన్సర్, భాను, చిన్ని, మున్నా, మోహన్, కమల్, కిరణ్, నవీన్, సతీష్ కుమార్, మోహన్ నాయుడు, మున్నా, కాజురు లత, జనసేన నేతలు లోచన్, ఆరీఫ్, ధీరజ్, అంజలి, అరుణ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరునత్తం పంచాయతీ పరిధిలో టిడిపి మాజీ ఎంపిటీసీ కృష్ణవేణి జైకుమార్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంచుతూ టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. టిడిపి పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరిస్తూ ఈ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని, ఎంపీ దగ్గు మళ్ల ప్రసాదరావు విజయానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణవేణి జైకుమార్, మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, బైరెడ్డిసాయిగౌడు, సాయిప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గౌరప్ప, మాజీ ఎంపీటీసీలు తిప్పారెడ్డి, విలవనాథ్, టిడిపి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'టిడిపి పాలనలోనే పేదల సంక్షేమం'

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో టీడీపీ పాలనలోనే అట్టడుగు వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టరు సురేష్ బాబు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనంద రెడ్డి, నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ ఎంపీపీ చిన్ని కృష్ణ తెలిపారు. శుక్రవారం వారు పల్లికుప్పం, ముద్దన పల్లి, ఆవులకుప్పం లలో శంఖారావంలో పాల్గొని సూపర్ సిక్స్ కార్యక్రమాలను ఇంటింట వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు ఎటువంటి మేలు జరగక పోగా, వారికి రక్షణ లేక పోయిందన్నారు. ముస్లింలలో వైసీపీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉండటంతో, వైసీపీ నేతలు టీడీపీ, బీజేపీ తో పొత్తు పెట్టుకోవడం పై రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎన్డీయే కూటమిలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటూ ఎన్నో సంక్షేమ పథకాలను అందించిందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే అవన్నీ రద్దయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు కూడా తీరని మోసం జరిగిందన్నారు. అన్ని వర్గాల ఆస్తి, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

టిడిపిలోకి భారీ వలసలు

రామకుప్పం మండలంలో శుక్రవారం వైసిపి నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పళ్ళికుప్పం, రామకుప్పం, వీర్నమలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. వారందరికీ డాక్టర్ సురేష్, కన్నన్ టిడిపి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

చెవిరెడ్డిపై విశ్వాసం కోల్పోతున్నారు: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రజల్లోనే కాకుండా క్యాడర్‌లో కూడా విశ్వాసం కోల్పోతున్నారని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తెలిపారు. శుక్రవారం మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామపంచాయతీకి చెందిన వైసిపి నాయకులు పులివర్తి నాని సమక్షంలో పలువురు టిడిపి కండువా కప్పుకున్నారు. బిటి ఆర్ కాలనీకి చెందిన మస్తాన్, సుశీల, కన్నమ్మ, రూప, మాధవి, కవిత, రోజా, అమ్ములమ్మ, సరస్వతి, సుభాషిని, చిత్ర, నందిని, దుర్గ, జ్ఞానంబ, గాయత్రి, తిరుమల నగర్ పంచాయతీకి చెందిన కిషోర్, వెంకీ, వసంత, ముని, గంగాధర్, సప్తగిరి కాలనీ పంచాయతీకి చెందిన నాగరాజు, వెంకటేష్, బాబు, నాగార్జున, రమేష్ పులివర్తి నాని సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ ఎన్నికల్లో పులివర్తి నాని విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

In the court of the Principal Junior Civil Judge of Kuppam
I.A.No. 116 of 2024
IN
O.S.No.145 of 2021

Between
S. Kiran Kumar ...Plaintiff
Versus
S. Prabhakar and 6 others ...Defendants

Suit Summons to Defendants 3 and 6

1.Smt. L.R. Aruna wife of L.K. Ramachandra Murthy and Daughter of Late. S. Doraswamaiah, Residing at No.63, Vyshali, 6th Block, Banashankari III stage, III Phase, Bangalore - 560 050.(D3)
2. Sri. S. Vinod son of Late. S Ramanath grand son of Late. S Doraswamaiah, C/o. S. Prabhakar, No.24, PWD Road, Ramarao Layout, Kathriguppa, Banashankari, III Stage, Bangalore 560 050. (D6)

Sirs/Madam,

Please Take suit summons that the plaintiff has filed the above suit for partition of the suit schedule property the said suit is posted to 07-05-2024 for your appearance. If you got any objection you may appear on 07-05-2024 at 10.30 A.M. either in person or through advocate. If you filed to do so the matter will be decided ex-parte.
Hearing Date: 07-05-2024.

//by order of the Court//
Sd/-B.Gunasekhar
Advocate for plaintiff,
Cell: 9966438058

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
भारत सरकार का उपक्रम A Goverment of India Undertaking

మంగళం శాఖ (23101), 9-679, కరకంబాడి మెయిన్ రోడ్డు, మంగళం క్వార్టర్స్ ఎదురుగా, తిరుపతి, తిరుపతి జిల్లా - 517507, ఫోన్: 9324923101

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002 లోని రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002(చట్టం 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)(రెండవ) రూల్స్2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించు కుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మంగళం శాఖ (23101), 9-679, కరకంబాడి మెయిన్‌రోడ్డు, మంగళం క్వార్టర్స్ ఎదురుగా, తిరుపతి, తిరుపతి జిల్లా** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **20.11.2023** తేది గల డిమాండ్ నోటీసు జారీ చేయబడిన **రుణగ్రహీత కె.సురేష్ బాబు, తండ్రి కె.వెంకటేష్ మరియు కో-అబ్లిగెంట్/ గ్యారంటారు - కె.మునెమ్మ భర్త కె.వెంకటేష్ మరియు ఆర్.చంద్రశేఖర్, తండ్రి పి.రామక్రిష్ణ గార్లను** సదరు నోటీసు అందుకున్న తేది నుండి 60 రోజులలో నోటీసులో తెలిపిన మొత్తం **తేది: 31.10.2023 నాటికి రూ.4,82,670.74 (నాలుగు లక్షల ఎనభై రెండు వేల ఆరు వందల డెబ్బై రూపాయల ఢెబ్బై నాలుగు పైసలు మాత్రమే)** లను + దానిపై తదుపరి వడ్డీ మరియు వ్యయాలను తిరిగి చెల్లించాల్సిందిగా కోరారు.

రుణగ్రహీత సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని దిగువ సంతకందారు **22.04.2024 తేదీన** స్వాధీన పరచుకున్నారని రుణగ్రహీతకు/ గ్యారంటార్‌కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో వ్యవహారము జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే ఏ వ్యవహారములైనా బకాయి మొత్తం **తేది:31.03.2024 నాటికి రూ.2,19,114.79 (రెండు లక్షల పంతొమ్మిది వేల ఒక వంద పద్నాలుగు రూపాయల ఢెబ్బై తొమ్మిది పైసలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ మరియు ఖర్చులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**వారికి చెల్లించుటకు లోబడి వుంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటార్‌ను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ 8లోని నిబంధనల ప్రకారం రుణగ్రహీత కు తమ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను పొందుటకు సమయం కేటాయించడమై నదని తెలియ జేయడమైనది.

స్థిరాస్తి వివరణ

తిరుపతి జిల్లా, తిరుపతి, రేణిగుంట సబ్ జిల్లా, రేణిగుంట మండలం, మంగళం గ్రూపు, అన్నాసామిపల్లె గ్రామలెక్కదాఖలా, సర్వేనెం.362 లోని డి.నెం.3-92 గల నివాస యోగ్యమైన భూమి మరియు బిల్డింగ్ యొక్క విస్తీర్ణం 897.75చ.అ. శ్రీ కె.సురేష్ బాబు పేరున వున్నది. హద్దులు: తూర్పు: రాజా వీధి, పడమర: టి.రమేష్ ఇల్లు, ఉత్తరం: లేన్, దక్షిణం: కె.చెంగయ్య ఇల్లు.

ప్రదేశం: మంగళం
తేది : 22.04.2024

సం॥ చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు - తిరుపతి
శనివారం 27 ఏప్రిల్
2024

తప్పుడు ఆరోపణలతో కుట్రకు తెర: థామస్

విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: తనపై తప్పుడు ఆరోపణలతో వైసీపీ నేతలు కుట్ర చేశారని టీడీపీ జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం ఆయన జీడీ నెల్లూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై తప్పుడు ఆరోపణలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడం భావ్యం కాదన్నారు. ఎన్నిక కుట్రలు చేసినా జీడీ నెల్లూరులో తాను టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానని స్పష్టం చేశారు. నాయకులు చిట్టిబాబునాయుడు, స్వామిదాస్, వెంకటేష్, దేవసుందరం, రాంబాబురెడ్డి, నియాజ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట పంచాయతీ బలిజపల్లి హరిజనవాడకు చెందిన వైసీపీ కుటుంబాలు శుక్రవారం టీడీపీ నేత మోహన్ మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో నాగరాజు, మురళి, వెంకటేశ్వరయ్య, కిరణ్ కుమార్, ఆర్ముగం, చక్రయ్య, బాబు, గిరిబాబు, మునుస్వామి, శివాజీ, పృధ్వి, రాము, ధనశేఖర్, శివ కుమార్‌లు ఉన్నారు.

భయోత్పాతం సృష్టించేందుకు కూటమి కుట్ర

- ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలి
- టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ఎన్నికల ప్రచారంలో టీటీడీ ఛైర్మన్ భూమన

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చిత్తూరు నుంచి రౌడీలు, అల్లరి మూకలను దింపి, భయోత్పాతం సృష్టించేందుకు కూటమి నాయకులు కుట్ర చేస్తున్నారని టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అల్లర్లు సృష్టిస్తూ, తమపై ఏదో ఒక నెపం నెట్టాలని చూస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎవరు పోటీ చేసినా అభ్యంతరం లేదన్నారు. కానీ స్థానిక పోలింగ్ బూత్ వద్ద కూర్చునే ఏజెంట్ అదే బూత్ పరిధిలో ఓటర్లై ఉండాలన్నారు. 25మంది స్వతంత్ర అభర్థులకు తిరుపతిలో ఏజెంట్లను పెట్టుకునే శక్తి లేదన్నారు. ఆ మాట కొస్తే తమకు పోటీగా నిలుచున్న జనసేన అభ్యర్థికే మొత్తం అన్నీ బూత్‌లలో ఏజెంట్లు నియమించుకునే అవకాశం లేని పరిస్థితి అన్నారు. అన్నీ తెలిసి కూడా 25మంది ఎందుకు చిత్తూరుకి చెందిన వారు తిరుపతిలో పోటీ చేస్తున్నారో అనే దగ్గరే కుట్ర దాగి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ దీనిమీద ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలన అందిస్తాం: నెలవల

ఇంటింటి ప్రచారంలో నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: టీడీపీకి ఓటేసి గెలిపిస్తే ప్రజా సంక్షేమ పాలనను అందిస్తామని నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి పరసారత్నం, నాయకులు సతీష్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, రాజేంద్ర తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయశ్రీ ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్ యాదవ్, రమణయ్య యాదవ్ పాల్గొన్నారు.

పేదలకు మంచి చేసింది వైసీపీనే: కుమార్‌రాజా

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: పేద వర్గాల ప్రజలకు మేలు చేసింది వైసీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర పాలఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండలంలోని జిల్లేడుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వైసీపీని మరో సారి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, సర్పంచ్ భారతి, ఎంపిటీసీ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచులు శరత్ రెడ్డి, గోవిందరాజులు, అశోక్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న చిత్తూరు జిల్లా కలెక్టర్ షన్మోహన్

నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

నామినేషన్ల పరిశీలన

తిరుపతి జిల్లాలో దాఖలైనవి - 227
చిత్తూరు జిల్లాలో - 172

చిత్తూరు జిల్లాలో 172 నామినేషన్‌లకు గానూ 67 తిరస్కరించారు. 105 నామినేషన్‌లను ఆమోదించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి 227కు గానూ 117 ఆమోదించి, 50 నామినేషన్‌లో లోపాలు ఉన్నవాటిని తిరస్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం: చిత్తూరు, తిరుపతి జిల్లాలో 2 పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులు నామినేషన్‌లు పోటాపోటీగా వేశారు. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్‌ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. తిరుపతి జిల్లాలో ఒక పార్లమెంటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 227మంది అభ్యర్థులు, చిత్తూరు జిల్లాలో ఒక పార్లమెంటు 7 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 172మంది వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్‌లకు సంబంధించి శుక్రవారం ఆయా ఆర్‌వో కేంద్రాల్లో పరిశీలన కార్యక్రమం జరిగింది. అభ్యర్థులు సమర్పించిన పత్రాల్లో లోటుపాట్లు ఉన్నవి తిరస్కరించారు. సరైన విధంగా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల పత్రాలను స్వీకరించారు. కాగా ఈ నెల 29న ఉపసంహరణ ఉంటుంది.

తిరుపతి జిల్లా అభ్యర్థుల నామినేషన్ పరిశీలన వివరాలు ఇలా..

నియోజకవర్గం	మొత్తం నామినేషన్‌లు	ఆమోదించినవి	తిరస్కరించినవి
తిరుపతి పార్లమెంటు	27	24	3
గూడూరు అసెంబ్లీ	21	15	6
సూళ్లూరుపేట అసెంబ్లీ	16	14	2
వెంకటగిరి అసెంబ్లీ	17	10	7
చంద్రగిరి అసెంబ్లీ	43	26	17
తిరుపతి అసెంబ్లీ	52	48	4
శ్రీకాళహస్తి అసెంబ్లీ	27	23	4
సత్యవేడు అసెంబ్లీ	24	17	7

చిత్తూరు జిల్లా అభ్యర్థుల నామినేషన్ పరిశీలన వివరాలు ఇలా..

నియోజకవర్గం	మొత్తం నామినేషన్‌లు	ఆమోదించినవి	తిరస్కరించినవి
చిత్తూరు పార్లమెంటు	35	21	14
పుంగనూరు అసెంబ్లీ	15	10	5
నగరి అసెంబ్లీ	24	7	17
గంగాధరనెల్లూరు అసెంబ్లీ	21	12	9
చిత్తూరు అసెంబ్లీ	21	14	7
పూతలపట్టు అసెంబ్లీ	19	12	7
పలమనేరు అసెంబ్లీ	19	14	5
కుప్పం అసెంబ్లీ	18	15	3

సమిష్టి కృషితో టీడీపీని గెలిపించుకుందాం: కురుగొండ్ల

ప్రజాశక్తి-వెంకటగిరి: శ్రేణులందరి సమిష్టి కృషితో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందాం అని కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియ ఆ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజి మున్సిపల్ కౌన్సిలర్‌లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లతో ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

బాలాయపల్లి: పిలిస్తే పలికే వ్యక్తి కురుగొండ్ల రామకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాట్రగుంట గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి అభివృద్ధి చేసే కురుగొండ్లకు ఓటు వేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చేస్తాడాని తెలిపారు. కొత్త వారి గారడి మాటలు నమ్మొద్దన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో పలువురి చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ శ్రీకాళహస్తి మండలం అక్కుర్తికి చెందిన 50మంది వైసీపీ కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం, అక్కుర్తి గ్రామం నుంచి నరేంద్ర, లాలుప్రసాద్, పవన్ సాయి, బాలు, గంగాధరం, ముని, గంగయ్య, ప్రేమ చందు, తిరుపాల్, మునస్వామి, పవన్ కళ్యాణ్, నాగ, మధు, బాలు,ఈశ్వర్, గోవర్ధన్ వీరిలో ముఖ్యులుగా ఉన్నారు. వీరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీడీపీలో ఎంపీటీసీ చేరిక

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మామడుగు పంచాయతీ కోటగురివేపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సుమిత్రమ్మ రత్నరెడ్డి సహా గ్రామానికి చెందిన 40కుటుంబాలు శుక్రవారం మాజీ మంత్రి అమరనాథ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికి ఆయన కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామచంద్రా రెడ్డి, దామోదర్ రెడ్డి, యమున, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, సురేష్, రమేష్, కళావతి, సిరాజ్, మాలతి, నాగరాజ, మోహన్ రెడ్డి, భూలక్ష్మి, ధనమ్మ, జమున, హేమావతి, సురేఖ, నాగమ్మ , లక్ష్మమ్మ, తులసమ్మ తదితరులు ఉన్నారు.

బిసివై పార్టీపై మళ్లీ దాడి

ప్రజాశక్తి - పుంగనూరు: భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి పుంగనూరు మండలంలో ప్రచారానికి వెళ్ళగా వైసీపీకి చెందిన యువత అవహేళన చేశారని వివాదం చెలరేగింది. మండలంలోని మాగాండ్లపల్లి పంచాయతీ కేంద్రంలో బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ శుక్రవారం ప్రచారానికి వెళ్లారు. మాగండ్లపల్లి గ్రామంలో వైసీపీకి చెందిన ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారని బీసీవై పార్టీకి చెందిన యువత దీనిని గమనించి వారిని నిలదీయడంతో ఆవేశానికి లోనై బొలెరో వాహన అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు దారితీసింది. మూడు గ్రామాలకు చెందినవారు మాగండ్లపల్లి గ్రామానికి చేరుకోగా అక్కడ ఉద్రిక్తతగా మారింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి బీసీవై పార్టీకి చెందిన కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా ఈ విషయాన్ని నాయకులు రామచంద్ర యాదవ్‌కు తెలపడంతో ఆయన జిల్లా ఎస్పీకి ఫోన్ ద్వారా జరిగిన విషయాన్ని తెలిపారు. పోలీసులు తీసుకొస్తున్న వారిని ఎస్పీ ఆదేశాల మేరకు వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి పంపించారు. ఈ సంఘటనలో బీసీవై పార్టీ వాహన అద్దాలు ధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతోవారు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బిసివై పార్టీ నాయకునిపై దాడికి పాల్పడటం ఇది నాలుగోసారి కావడం గమనార్హం.

వాల్మీకుల మద్దతు టీడీపీకే: విశ్రాంత డీఎస్పీ

ప్రజాశక్తి-పుంగనూరు: వాల్మీకి కులస్తులు పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనను టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి కులస్తుల తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకోగా తమ కులస్తులను ఎస్టిలో చేర్చేందుకు టీడీపీ హామీ ఇచ్చిందని, అలాగే మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కూడా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు వాల్మీకి కులస్తులు 12వేల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సివిరెడ్డి, వాల్మీకి కులస్తులు గంపల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఎన్ఎస్ పేట పరిధిలోగల వార్డుల్లో విస్తృతంగా శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, పుంగనూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ వైసీపీ పార్టీలో చేరారు. చాలా సంవత్సరాలుగా టీడీపీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి సోదరుడు శ్రీనాథ్ రెడ్డి ఆయన సతీమణి అనిషారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాషా పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం

- పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్

మహిళా భేరి సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: టీడీపీ పాలనలోనే మహిళల అభ్యున్నతికి, సాధికారతకు బాటలు పడ్డాయని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌లు చెప్పారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ అధ్యక్షతన చిత్తూరు నియోజకవర్గ మహిళా భేరి సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందడుగు వేసేందుకు నాడు ఎన్టీఆర్, తరువాత చంద్రబాబు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు, అఘాయిత్యాలకు అంతే లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు స్త్రీని అబలగా చూసేవారు.. వారిని వంటింటికే పరిమితం చేసేవారన్నారు. స్త్రీలకు గౌరవం, ధైర్యం, హక్కులు ఇచ్చి మహిళలను సాధికారంగా సమాజంలోకి తీసు కొచ్చిన వ్యక్తి అన్న ఎన్టీఆర్. 1986లో ఎన్టీఆర్ స్త్రీలకు ఆస్తిలో సమానహక్కును కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా తిరుపతిలో పద్మావతి యూనివర్శిటీని తీసుకొచ్చారని తెలిపారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఆయన వల్లే మహిళలు నేడు రాజకీయాల్లో ముందుకెళ్తున్నారు. తరువాత చంద్రబాబు హయాంలో ప్రతి కిలోమీటరుకు ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లలో అప్పర్ ప్రైమరీ, 5కిలోమీటర్లకు హైస్కూలు వీటితో పాటు కాలేజీ, డిగ్రీకాలేజీ, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని వివరించారు. అనంతరం చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి ప్రసాద్ రావు మాట్లాడుతూ.. మహిళ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నో పథకాలు తీసుకొచ్చి వారి జీవితాలలో వెలుగులు నింపారని తెలిపారు. సదస్సులో జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు వైవీ రాజేశ్వరి, సీఎం విజయ, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు ఇందిర, మాజీ మేయర్ కటారి హేమలత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాణి, సీకే లావణ్య, నగర మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లి గ్రామ పంచాయతీ శెట్టిగారిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు రాజానాయుడు, శ్రీరాములు నాయుడు, మురళీ, తంగరాజు, తాలంబేడు గ్రామ పంచాయతీకి ఓ.వెంకటాపురం గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి, హరిబాబు, సుబ్బా నాయుడు, కోదండ రెడ్డి తదితరులు శుక్రవారం బీవీ రెడ్డి కాలనీలోని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నివాసంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సమక్షంలో టీడీపీలో చేరారు.

మహిళలను గౌరవించేది టిడిపి: సంధ్యారాణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మహిళలను గౌరవించే టిడిపి అని గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గూడూరు టిడిపి కార్యాలయంలో ఆమె మహిళలతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించిందన్నారు. టిడిపి పథకాలు మహిళలకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త పాశం సునీల్ కుమార్, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో వరప్రసాద్ రావు విజయానికి సహకరించాలని కోరారు.

డయాలసిస్ బాధితుడిని పరిశీలిస్తున్న దాతలు

డయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: డయాలసిస్‌తో బాధ పడుతున్న ఓ యువ కునికి వైద్య సహాయం కోసం 6,100 రూపాయలు అందించామని పాకాల లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఛైర్మన్ మారసాని విజయబాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతనంద అనే ఆటో డ్రైవర్ డయాలసిస్‌తో తీవ్రంగా బాధ పడుతూ తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందు తున్నాడన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందించాల్సిన వైద్య సేవల పరిమితి కూడా దాటి పోవడంతో అతని కుటుంబీకులు బంధు వులను, స్నేహితులను ఆశ్రయిం చారన్నా రు. ఈ విషయంపై పాకాల లయన్స్ ట్రస్ట్ కార్య నిర్వాహక కమిటీ దృష్టికి తీసుకెళ్లానని తెలిపిన ఆయన, అందుకు స్పందించి కార్యనిర్వహణ కమిటీ ట్రస్ట్ నిధి నుంచి 5వేల రూపాయలు అందించేందుకు అనుమతి నిచ్చారన్నారు. ట్రస్ట్ సభ్యుడు లయన్ మారసాని మహేష్ బాబు అందించిన 1100 రూపాయలు కలిపి మొత్తం 6,100 గీతానందు తల్లికి అందించామని తెలి పారు. బాధితుని తల్లి పాకాల లయన్స్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞత లు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

21 మంది వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని ఉత్తమ నెల్లూరు, కొక్కుపాడు పంచాయతీ పరిధిలోని వాలంటీర్లు 21 మంది రాజీనామా చేశారు. శుక్రవారం కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉత్తమ నెల్లూరు పంచాయతీకి చెందిన 10 మంది వాలంటీర్లు, కొక్కుపాడు పంచాయతీకు చెందిన 11 మంది వాలంటీర్లు ఎంపీడీవో శంకరయ్య కు రాజీనామా పత్రాలు అందించారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎంపిడివో శంకరయ్య

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని చెందోడు పంచాయతీ, కోట పంచాయతీలోని 178,179 పోలింగ్ కేంద్రాలను కోట ఎంపీడీవో శంకరయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ త్వరలో రానున్న ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. నీటి వసతి, విద్యుత్ వసతి, టాయిలెట్స్, తదితర వసతులు అన్ని సక్రమంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు, ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు.

15 నామినేషన్లు ఆమోదం

- రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు శాసన సభ స్థానానికి 21 మంది నామినేషన్లు దాఖలు చేశారని, 15 మంది నామినేషన్లు సక్రమంగా వున్నాయని, ఆరు నామినేషన్లను తిరస్కరించమన్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి నామినేషన్ ప్రక్రియ చేపట్టా మన్నారు. ఈ పరిశీలనలో గూడూరు, సర్వేపల్లి, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు కరీ గౌడ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్

బొజ్జల ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి రూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఫ్యాక్షన్ రాజకీయాలను బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మానుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊరందూరు లో రైతు దిలీప్‌కు చెందిన ట్రాక్టర్‌ను గురువారం రాత్రి టిడిపి అభ్యర్థి సుధీర్ రెడ్డి అనుచరులు పెట్రోల్ పోసి తగుల పెట్టారని బాధితుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం ఉదయం ఊరందూరులో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. బాధితుల కుటుంబాన్ని పరామర్శించి వారిలో ధైర్యం నింపారు.

కాలిపోయిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ కీయాలు ఎన్నికల తేదీ వరకే ఉంటాయని సుధీర్ రెడ్డి గుర్తుంచుకో వాల న్నారు. రాజకీయాల కోసం రైతు ల మీద కక్ష తీర్చుకోవడం చేతగాని తనా నికి నిదర్శనమన్నారు. 'నీ స్వగ్రా మంలో నీ మాట వినలేదని రైతు ట్రాక్టర్‌ను తగలబెట్టడానికి మనసు ఎలా వచ్చిందని ప్రశ్నిం చారు. 30 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఎన్నడూ ఇలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు చూడ లేదన్నారు. ఈ హేయమైన చర్యపై ఎలక్షన్ కమిషన్‌కు, పోలీస్ శాఖకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని అక్కుర్తి పంచాయతీలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్స రా లుగా వైసిపి చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు తాము బలైపోయామని గడచిన 30 సంవత్సరాలలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా, ఎమ్మెల్యేగా కొన సాగిన కాలంలో ఎప్పుడూ శాంతి భద్రతలకు విఘాతం కలగ లేదని అలాంటి పరిపాలన అందించే ఆయన తనయు డు బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరా మని తెలిపారు. టిడిపి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి: నూకతోటి రాజేష్

ప్రజాశక్తి - సత్యవేడు: అభివృద్ధి కావాలంటే ఓటు హక్కును వినియోగించుకోవాలని వైసిపి సత్యవేడు నియోజకవర్గ అభ్యర్థి నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. సత్యవేడు పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పరిశీలన కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు, తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, మరో కీలక నేత భానుప్రకాష్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు, పరిశీలన కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడు తూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల గుండెల్లో నిలిచిపోయాయని రాబోయే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధిస్తా మని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ప్రజా సంక్షేమం తప్ప పొత్తులు, కులసమీకరణలపై ఆధారపడి

మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

రాజకీయం చేస్తున్నా యని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలు సని, ఎవరు విశ్వసనీయు లో ప్రజలకు అర్థమ వుతుందన్నారు. జగనన్న పాలన నిజాయ తీ, నిబద్ధతతో సాగిం దని, చంద్రబాబు పాలన మోసం, వంచన తో సాగిందని రాజేష్ గుర్తు చేశారు. గతంలో చంద్రబా బు 600 హామీలు ఇవ్వడంతో పాటు, నూరు పేజీల మేనిఫెస్టో విడుదల చేసి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేద న్నారు, ఓటు మన భవిష్యత్తును మార్చేస్తుందని , సామాజిక అభివృద్ధి కావాలంటే ప్రతి ఒక్కరూ వారి వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు , ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరిస్తాం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గ్రామీణ వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంస నీయమని అలాంటి వైద్యుల సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తా మని గూడూరు అసెంబ్లీ నియోజక వర్గ టిడిపి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు టిడిపి కార్యా లయంలో గూడూరు నియోజకవర్గ గ్రామీణ వైద్యులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ

మాట్లాడుతున్న గూడూరు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్

గ్రామీణ వైద్యులు గ్రామా ల్లోని పేదలకు అందిస్తున్న వైద్య సేవలు స్ఫూర్తి దాయకమని ప్రధానంగా కరోనా సమ యం లో గ్రామీణ వైద్యులు అందించిన సేవలు చిరస్మరణీయంవని పేర్కొన్నారు. అలాంటి గ్రామీ ణ వైద్యుల సంక్షే మానికి, వారి సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఒకరోజు పర్యటన నిమిత్తం శుక్రవారం సాయంత్రం చిత్తూరు జిల్లాకు వచ్చిన హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కి జిల్లా జడ్జి ఇ.భీమారావు స్వాగతం పలికారు. ఈ నెల 27న చిత్తూరు జిల్లా కేంద్రంలో నూతన ప్రధాన న్యాయ స్థాన భవన సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన నేపథ్యంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కి ప్రభాస్ హోటల్ వద్ద జిల్లా జడ్జి తో పాటు పలువురు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఏడీజే రమేష్ , మూడవ ఏడీజే తిరుపతి గురునాథ్, ఆరవ ఏడీజే శాంతి, ఎనిమిదవ ఏడీజే శ్రీదేవి, అడిషనల్ సివిల్ జడ్జ్ సీనియర్ డివిజన్ వెన్నెల, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ తిరుపతి విజయ సారధి రాజు,. ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ ఉమాదేవి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ మాధవి, అడిషనల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ తిరుపతి కోటేశ్వరరావు, అడిషనల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ శ్రీనివాసరావు, అడిషనల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ షేక్ బాబాజాన్, అడిషనల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కీర్తన, జిల్లా ఎస్పీ మణికంఠ మణికంఠ చందోలు చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సభ్యులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి అభివృద్ధి ప్రధాత, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని 24వ వార్డులో శుక్రవారం అంజూరు శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. సంక్షేమ, నవరత్న పథకాలు గడపగడపకు అందా యా? లేదా.. అని అరా తీశారు. బియ్యపు మధు సూదన్ రెడ్డిని విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కిరణ్, మున్నా, పగడాల రాజు, పుట్టం రాజా ముదిరాజ్, కంట ఉదయ్ కుమార్, మొగరాల గణేష్, కొల్లూరు హరినాథ్ నాయుడు, ఉత్తరాజ శ్రవణ్ కుమార్, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరికి కడప సంస్కృతి తీసుకొచ్చింది చెవిరెడ్డే: పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రశాంతంగా ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో కడప హింసాత్మక సంస్కృతిని తీసుకువచ్చింది ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని, గురువారం తిరుపతి ఆర్డీఓ ఆఫీసు వద్ద నామినేషన్ ఘర్షణ ఘటనకు కారణం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డే అని చంద్రగిరి టిడిపి శాసనసభ అభ్యర్థి పులివర్తి నాని ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాగానే 18వ తేదీ తొలి నామినేషన్ వేశానని, ఆ రోజే ఈఆర్ఓకు రానున్న 25వ తేదీ మళ్లీ నామినేషన్ దాఖలు చేస్తానని చెప్పానన్నారు. ప్రణాళిక ప్రకారం తాను నిర్ణయించుకున్న తేదీనే నామినేషన్ వేయడానికి వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముందు నిర్ణయించుకున్న తేదీని మార్చుకొని ఈఆర్ఓకు వినతి పెట్టుకున్నారన్నారు. మొదట వైసిపికి సంబంధించిన అభ్యర్థి కుటుంబ సభ్యులతో కలిసి ఈఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లిన సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రధాన అనుచరుడైన తొండవాడ సర్పంచి చంద్రమౌళీశ్వర్ రెడ్డి కుమారుడు టిడిపి జెండాను కిందేసి తొక్కడంతో ఘర్షణ మొదలైందని, కారణమైన సంఘటనలను వీడియో ద్వారా మీడియాకు చూపించారు. ఘర్షణకు కారకులైన వైసీపీ వారిపై ఈఆర్వో ఫిర్యాదు చేయకుండా టిడిపి వారిపై ఈసికి ఫిర్యాదు చేశారన్నారు. ఇలాంటి ఘర్షణ సృష్టిస్తారనే ముందస్తుగా వీడియోలు చిత్రీకరించామని, వీటి ఆధారాలతో ఎలక్షన్ కమిషన్‌కు తాను ఫిర్యాదు చేశానన్నారు. తన సొంత గ్రామం పులివర్తి వారి పల్లి అని, ఇక్కడే ఆస్తులు కలిగి ఉన్నా నాన్ లోకల్ అని ప్రచారం చేయడం, చిత్తూరు రౌడీయిజం చేస్తున్నారని ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. తుడ కాంట్రాక్టర్లు పార్టీ

మాట్లాడుతున్న పులివర్తి నాని

మారుతారని వారి పనులకు బిల్లులు ఆపు చేయించారన్నారు. ఎమ్మెల్యే పీఏ లోకనాథరెడ్డి ఎమ్మెల్యే అండతో 100 కోట్లకు పైగా ఆస్తులు కూడ బెట్టారన్నారు. వారందరూ టిడిపి వారిపై దాడులకు పాల్పడేలా ప్రోత్సహిస్తారన్నారు. ఇలాంటి ఘటనలే పోలింగ్ రోజు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారని, చెవిరెడ్డి పై రెక్కీ నిర్వహించారని అబద్ధపు ఆరోపణలు చేశారని, ఏ ఆలయం వద్దకైనా వచ్చి ప్రమాణం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, డాలర్స్ దివాకర్ రెడ్డి, గణపతి నాయుడు, ఈశ్వరయ్య, మధు, సునీల్, గోపీనాథ్ పాల్గొన్నారు.

వేసవి వినోదం.. విజ్ఞాన సంబరం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

చెస్ ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. సెలవుల్లో వినోదంపై పిల్లలు ఎక్కువగా ఇష్టపడతారు. ఈ నేపథ్యంలో చిత్తూరు మిట్టూరులోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో వినోదం కోసం విద్యార్థులకు చెస్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిసల వుతున్న సందర్భంలో విజ్ఞాన కేంద్రం వినూత్నంగా విద్యార్థులకు చెస్ నేర్పించేందుకు ముందుకు వచ్చింది. తద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

మేధోశక్తి పెంచేందుకే..

ఏకాగ్రత, మేధాశక్తి పెంపొందించుకొనేందుకు ఈ వేసవి శిక్షణా శిబిరాలు దోహదపడతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, చెస్ కోచ్ అరుణ, శివప్రసాద్ తెలిపా రు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యార్థులు సెల్ ఫోన్‌కు బానిసలైన సందర్భంలో వారికి చెస్ నేర్పించడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ ఈ క్యాంపు మే 4వ తేదీ వరకు జరుగుతుందని, మే 1వ తేదీ నుంచి విద్యార్థులకు చెస్‌పై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గిరిధరమూర్తి మాట్లాడుతూ ఇండోర్ గేమ్స్ ఉత్తమమైందని అందులో చెస్ ప్రత్యేకమైనదని తెలుపుతూ చదువుపై పాటతో విద్యార్థులను అలరించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత చెస్ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, విజయ్, వేణు గోపాల్ పాల్గొన్నారు.

శంకరమ్మ పై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మండలం చిలికంపాడు అంగన్‌వాడీ టీచర్ శంకరమ్మపై దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ మంజుల, బడ్డిపల్ల చెంగయ్య కోరారు. శంకరమ్మ ఐసిడిఎస్ కార్యాలయానికి వెళ్లి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ తీసుకుని పోస్టల్ బ్యాలెట్ కోసం వెంకటగిరి తహశీల్దారు కార్యాలయంలో అప్లికేషన్ ఇచ్చి తిరిగి వస్తూ ఉండగా పుట్టా వెంకటయ్య కాశిపేట ఏరియాలో ఆమెను అడ్డగించి పెద్ద ఎత్తున దాడి చేసి గాయపరిచారన్నారు. జుట్టు పట్టుకుని రోడ్డంతా ఈడ్చి కాలితో కొట్టాడన్నారు. ఆమె అక్కడే స్పృహ కోల్పోయిందని, మహిళ అని చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించిన వెంకటయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

ఐఐటి క్యాంపస్‌లో సిబ్బంది కొరత

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఐఐటీ క్యాంపస్ లో ఓబిసి నాన్ క్రీమ్ లేయర్ సర్టిఫికేట్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు వచ్చి ఇబ్బంది పడుతున్నారు. శనివారం రోజు లాస్ట్ డేట్ అవడం వల్ల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సచివాలయం అధికారులకు ఇతర పనులు అప్పగించడమే ఇందుకు కారణం..ఒక్కరూ లేరు.. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపపట్టాల్సి ఉంది.

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని డిజియం కొండలరావు తెలిపారు. రాయపాటి పుష్కర్ 300కి 291 మార్కులతో మ్యాథ్స్, కెమిస్ట్రీలో నూటికి నూరు పర్సంటైల్తో మొత్తం మీద 99.99 పర్సంటైల్తో ఓపెన్ కేటగిరీలో 225వ ర్యాంకు సాధించారన్నారు. అన్ని క్యాటగిరీలలో జ్యోష్మిత-2 దినేష్ ప్రసాద్-253, జస్వంత్-255, హితేష్ రాహుల్-274, వివేకానంద రెడ్డి-285, మునివెంకట రెడ్డి-324, ప్రకాష్-384, సాయిప్రసన్న-512, మైత్రిశ్రీ-553, తన్మయి కృష్ణ- 608, వివస్వత్-1629, నాగసుమేధ్-3819, బాలాజి-4712, రుత్విక్ రెడ్డి-4945, ఆదిత్య నివాస్-5303 వంటి టాప్ ర్యాంకులతో పాటు మొదటి వందలోపు-1, వెయ్యిలోపు 12, ఐదువేలలోపు 28, పదివేలలోపు - 34 ర్యాంకులు సాధించారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, డీన్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

'విశ్వం'లో ఉచిత అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్ లో సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ లో 2025 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఉచిత అవగహన సదస్సును ఆదివారం నిర్వహిస్తామని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు,విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు ఎన్ విశ్వనాథ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు 4వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, వారి తలిదండ్రులు హాజరై ఈ పోటీ పరక్ష వివరాలు, వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షలో సీట్లు పొందడానికి మెలుకువలను పద్ధతులు వివరిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 ఫోను నెంబరులకు సంప్రదించవచ్చునని తెలిపారు.

'టీ గ్లోస్'ను ప్రారంభించిన టొయోటా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: వినియోగదారులకు అనుగుణంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్ ప్రైవేట్ లిమిటెడ్ విప్లవాత్మక కార్ కేర్ బ్రాండ్, 'టీ గ్లోస్'ను ప్రారంభించినట్లు ఆ సంస్థ సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్ డిటైలింగ్ సేవలకు వేగంగా పెరుగుతున్న డిమాండ్‌కు ప్రతిస్పందనగా, టికేయం కార్ల సంరక్షణ పరిశ్రమను, టొయోటా వాహనాల కోసం ప్రత్యేకం గా దీన్ని రూపొందించామన్నారు. దేశంలోని ప్రతి డీలర్ షిప్ వద్ద ఇవి లభిస్తాయని తెలిపారు. ఇందులో సిరామిక్ కోటింగ్, అండర్ బాడీ కోటింగ్, సైలెన్సర్ కోటింగ్, ఇంటర్నల్ ప్యానెల్ ప్రొటెక్షన్ ఉన్నాయి. ఈ ట్రీట్‌మెంట్స్, వాహనాల సౌందర్య ఆకర్షణను పెంపొందించ చడమే కాకుండా పర్యావరణ పరమైన ప్రతికూలతలకు వ్యతిరే కం గా నిర్దిష్ట స్థాయి రక్షణను కూడా అందిస్తాయన్నారు. వినియోగదారులు తమ కారుకు కొత్త జీవం పోసే ఇంటీరియర్ ఎన్‌రిచ్‌మెంట్, ఎక్స్‌టీరియర్ బ్యూటిఫి కేషన్ వంటి సమగ్ర సేవలను కూడా పొందవచ్చు న్నారు. ఇది సౌందర్య ఆకర్షణను పునరుజ్జీవింపజేస్తుంది. ఇది కొత్తదిగా కనిపించేలా చూసుకోవచ్చు. వినియోగదారుల సౌకర్యం కోసం టయోటా కంపెనీ దీన్ని ప్రత్యేకంగా రూపొందించిందని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాజ అభివృద్ధికి శిక్షకులు అవసరం

- జేసీఐ ఇండియా ఉపాధ్యక్షులు ఎన్‌బిహార్షవర్ధన్ రెడ్డి

మాట్లాడుతున్న జేసీఐ ఇండియా ఉపాధ్యక్షులు ఎన్‌బి హర్షవర్ధనరెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సమాజ అభివృద్ధికి శిక్షకులు అవసరం అని జేసిఐ ఇండియా ఉపాధ్యక్షులు ఎన్‌బి హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. స్థానిక మానస ఇన్ హోటల్లో జరిగిన జేసీఐ ఇండియా జోన్-26 స్పీచ్ క్రాఫ్ట్ 2024ను జేసీఐ ఇండియా ఉపాధ్యక్షులు ఎన్‌బి హర్షవర్ధన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి నాయకులు ఎంత అవసరమో, అంతకు మించి శిక్షకుల అవసరం వుందన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా సరైన శిక్షణ అవసరం అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా శిబిరానికి రాష్ట్ర నలుమూలల నుంచి 30 మంది ఎంపిక య్యారు. వీరందరికీ శిక్షణ అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలో ఉచిత శిక్షణలు నిర్వహిస్తారని తెలిపారు. జేసీఐ సభ్యులకూ శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోన్ అధ్యక్షులు కె కృష్ణ భాస్కర్ మాట్లాడుతూ జేసీఐ కార్యక్రమాల గురించి తెలిపి, ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జేసీఐ తిరుపతి ఒడిస్సీ అధ్యక్షులు డాఎస్ హరిత, కార్యక్రమ ఛైర్పర్సన్ డా వి నీరజ ఇతర బృందాన్ని అభినందిం చా రు. కీలక ఉపన్యాసకులు జిఎల్ మనోహర్ మాట్లాడుతూ జేసీఐ శిక్షణా రంగంలో తీసుకొచ్చిన మార్పుల గురించి, తన 30ఏళ్ల శిక్షణ అనుభూతులను పంచు కున్నారు. జోన్ ఉపాధ్యక్షులు మనోజ్ విష్ణు మాట్లా డుతూ శిక్షకులు సంస్థలకు ఊపిరి పోసేవాళ్లని తెలిపారు. ఈ శిక్షణను విశాఖపట్నంకు చెందిన జాతీయ శిక్షకులు జయలక్ష్మి, రాజమండ్రికి చెందిన అనంత కల్యాణి, కెవిఎన్ కార్తీక్ శిక్షకులుగా ఉంటారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఛైర్పర్సన్ డా లావణ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్స్ ఎన్ లలిత, మన్విత్, జేసీఐ తిరుపతి ఒడిస్సీ కార్యదర్శి కె శ్రీదేవి, కోశాధి కారి పురుషోత్తం, జేసీఐ తిరుపతి శాఖ అధ్యక్షులు టివై చైతన్య తేజ్, ఇతర నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

పల్లె ప్రగతిని పరుగులు పెట్టిస్తా..

బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి అధికారంలోకి రాగానే పల్లె ప్రగతిని పరుగులు పెట్టిస్తానని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ దావులూరు రామానాయుడు తో కలిసి పర్యటించారు. గడపగడపకు వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో బహిరంగ సభనుద్దేశించి మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలల్లో పల్లె ప్రగతి గాడి తప్పిందన్నారు. పల్లె పాలన పడకేసిందని, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారని వాపోయారు. తమ తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా గ్రామ స్వరాజ్యం కోసం ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. ఆయన కాలంలో నెలకొల్పిన మౌలిక వసతులే నేటికీ పల్లెల్లో దర్శనమిస్తున్నాయని, బియ్యపు మధుసూదన్ రెడ్డి చేసిన ఏ ఒక్క అభివృద్ధి పనైనా గ్రామాల్లో కనిపిసస్తోందా?' అంటూ ప్రశ్నించారు. పల్లె ప్రగతి తిరిగి అభివృద్ధి పథం పట్టాలంటే సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, రాజేంద్ర పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో తిరుపతి 'ఆకాష్ ' విద్యార్థుల హవా

జెఈఈ టాప్ ర్యాంకర్లను అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి తిరుపతి సిటీ : జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో ఆకాష్‌కు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి వంద శాతం ఫలితాలు సాధించి టాప్ ర్యాంకర్లుగా నిలిచి, తన హవా కొనసాగించి ఆ విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ కంచర్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ఏరు బైపాస్ రోడ్ లోని ఆ కళాశాల కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయస్థాయిలో (ఉమెన్ క్యాటగిరి) టాప్ ర్యాంక్ 1 సాన్వి జైన్ సాధించి ఆకాష్ ప్రతిష్టను ఉన్నత స్థితిలో నిలిపారన్నారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన ఇద్దరు విద్యార్థులు రిథివిక్ 99.31, కనాలా జయచంద్రా రెడ్డి 99.11 పర్సంటైల్ సాధించారని, వీరితోపాటు ఎం శివ చరణ్, చక్రాల వంశి కృష్ణ, వెంకట మురళి కృష్ణ రెడ్డి, సాయి రోహిత్ రెడ్డి, తనుశ్రీ రెడ్డి, హరిత కూడా 98 మార్కులకు పైగా పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి మేళతాళాల మధ్య ఊరేగించి ఉత్సాహపూరితమైన వాతావరణంలో మెమెంటోలు, మెడల్స్, పూలమాలలతో సత్కరించారు. ర్యాంకులు సాధించిన తొమ్మిది మందితో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 25 మందిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆల్ ఇండియా ఉమెన్ క్యాటగిరిలో శాన్వి జైన్ ఒకటో ర్యాంక్ తో పాటు సాయి దివ్య తేజ రెడ్డి 15 ర్యాంకు, రిసీ సుక్ల 19వ ర్యాంకు సాధించి 50 లోపు ర్యాంకులలో తాము మూడు ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు వెల్లడించారు. వందలోపు ఎనిమిది ర్యాంకులు 500 లోపు 36 ర్యాంకులు వెయ్యిలో 1000 లోపు 62 ర్యాంకులను సొంతం చేసుకున్నట్లు ప్రకటించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రీజినల్ డైరెక్టర్ ధీరజ్ కుమార్ మిశ్రా, డిప్యూటీ డైరెక్టర్ ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, ఆర్ఎహెచ్ చందన్ చాంద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ మోడెమ్ నరసింహులు, అకాడమిక్ హెడ్ ఇంజనీరింగ్ పురిజాల రామ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరుకు

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల రాక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో ఒక రోజు పర్యటనలో భాగంగా శనివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు రానున్నారని కలెక్టర్ ఎస్.షన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం చిత్తూరు జిల్లా నూతన ప్రధాన న్యాయస్థాన భవన సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ వి.ఎన్.భట్టిలు రానున్నట్లు పేర్కొన్నారు.

పర్యటన ఇలా..

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ శుక్రవారం బెంగుళూరు నుంచి బయలుదేరి రా.8.30గం.లకు చిత్తూరు చేరుకొని రాత్రి బస చేస్తారు. శనివారం ఉదయం 9.30 జిల్లా ప్రధాన న్యాయస్థానముల నూతన భవన సముదాయముల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.00గం.లకు చెన్నై బయలుదేరి వెళతారు.
- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి శనివారం మదనపల్లె నుంచి బయలుదేరి ఉదయం 8.30గం.లకు చిత్తూరు చేరుకొంటారు. 9.30గంటలకు జిల్లా ప్రధాన న్యాయస్థానముల నూతన భవన సముదాయముల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మ.1.30గం.లకు మదనపల్లెకు బయలుదేరి వెళతారు.

విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు దారుణం

- **యుటిఎఫ్ జిల్లా శాఖ**

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం దారుణమని యూటీఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు (యుడైస్)2023-24 పాఠశాల అభివృద్ధి ప్రణాళికను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారన్న ఉద్దేశంతో షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. యుటిఐఎస్ఈలో వాస్తవాలను తెలిపినందుకు ఇలా షోకాజ్ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని శుక్రవారం ఒక ప్రకటనలో ఐఖ్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నేతలు డిఈఒ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా

విద్యాశాఖధికారుల నిర్లక్ష్యం మాత్రమే, కాబట్టి దీనికి వారే బాధ్యత వహించాలని యూటిఎఫ్ పక్షాన కోరుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి పాఠశాలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం ఉందా లేదా అన్న అంశంపై ప్రాథమిక పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం ప్రస్తుతానికి లేదని నింపినందుకుగాను, నిర్లక్ష్యం వహించారన్న ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 213మందికి పైగా ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బోధనేతర కార్యక్రమాలలో చిన్న చిన్న కారణాలు చూపి ఇలా చేయడం సమంజసం కాదని యుటిఎఫ్ నేతలు తెలిపారు. షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి: ఫ్యాప్టో

చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా యుడైస్ ప్లస్ భర్తీ చేయడంలో వివిధ కారణాల వలన టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింది. 25 మండలాల్లో పనిచేస్తున్న 213మంది ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు ఇవ్వడాన్ని ఫ్యాప్టో నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. వెంటనే ఆ నోటీసులను వాపస్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలా లేనిపక్షంలో ఉపాధ్యాయులందరినీ కలుపుకొని తమరి కార్యాలయం ఎదుట ప్రత్యక్ష కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టడానికి వెనుకాడమని చిత్తూరు జిల్లా ఫ్యాప్టో సభ్య సంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టొ చైర్మన్ మునాఫ్, నాయకులు చెంగల్ రాయ మండది, జీవిరమణ, మదన్‌మోహన్ రెడ్డి, కిరణ్‌కుమార్, కె.రెడ్డెప్ప నాయుడు, పి.సురేష్‌కుమార్, చిట్టిబాబు, ఎస్‌పి బాషా, గణేష్‌కుమార్, భానుప్రకాష్, దామోదరం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతకు అభినందనలు

జ్యోతిషాను అభినందిస్తున్న సిఆర్ మహేష్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్ హైదరాబాద్‌లో నిర్వహించిన ఇంగ్లీష్ సాక్షి స్పెల్‌బి పోటీల్లో తృతీయ స్థానం సాధించడం అభినందనీయమని సంసిద్ క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ సిఆర్ మహేష్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచిన జ్యోతి షాను అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు 2012- 23 సంవత్సరంలో 10మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. విద్యార్థులు పోటీతత్వం పెంచుకోవాలని సూచించారు.

శ్రీసిటీలో గ్రంథాలయం, క్రికెట్ మైదానం ప్రారంభం

ప్రజాశక్తి - సత్యవేడు సామాజిక వసతుల కల్పనలో భాగంగా శ్రీసిటీలో నూతనంగా కమ్యూనిటీ గ్రంథాలయం, క్రికెట్ మైదానంలను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం స్థానిక క్రీక్ సైడ్ నివాస సముదాయం సమీపంలోని షాపింగ్ ఆర్కేడ్ రెండవ అంతస్తులో లాంఛనంగా పూజలు ఆచరించి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్మయా విద్యాలయ ట్రస్టీ ఓవి నంబియార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అలాగే స్థానిక జ్ఞాన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానాన్ని శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ప్రారంభించారు.

శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం, చిన్మయ విద్యాలయ, అకార్డ్ విద్యా సంస్థల విద్యార్థులతో పాటు పరిశ్రమ వర్గాలు ఆటవిడుపుగా ఈ క్రికెట్ మైదానాన్ని వినియోగించుకోవచ్చు. గతంలో కూడా క్రీడా వసతుల్లో భాగంగా శ్రీసిటీలోని ఇన్ అతిథిగహం సమీపంలో గోల్ఫ్ కోర్స్ మైదానాన్ని నెలకొల్పారు. భవిష్యత్‌లో మరిన్ని వసతులను అందుబాటులోకి తెస్తామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.

ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధిగా హేమచలపతి

ప్రజాశక్తి-రామకుప్పం: వైసీపీ చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా రామకుప్పం మండలానికి చెందిన మాజి సర్పంచ్ హేమచలపతిని ఎన్నుకున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు భరత్ తెలిపారు. మండలంలోని గౌరివిమాకుల పల్లి పంచాయతీ, పెద్ద గెరిగపల్లికి చెందిన హేమచలపతి వైసిపి మాజి మండల కన్వీనర్‌గా, మాజి సర్పంచ్‌గా, ఏఎంసి సభ్యుడిగా చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఈ పదవిని అందించటంపై రామకుప్పం మండల ఎంపిపి సుబ్రమణ్యం, వైసిపి కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవి అందించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపి రెడ్డెప్పకు, ఎమ్మెల్సీ భరత్‌కు హేమాచలపతి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో తనపై మరింత భాధ్యత పెరిగిందని జిల్లాలో వైసిపి అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ, టీడీపీలకు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే: రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ, టీడీపీలకు ఓటేస్తే వారంతా బీజేపీ ఖాతాకు చెందిన వారేనని నగరి ఇండియా ఫోరం అభ్యర్థి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వడమాలపేట మండలలో మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వస్తే వారు చేయబోయే అభివృద్ధి, అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ పురుషోత్తం రెడ్డి, చిరంజీవిరెడ్డి, నాయకులు

ఇంటింటి ప్రచారంలో రాకేష్‌రెడ్డి

రత్నం, పుత్తూరు రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కేశవులు, నగిరి రూరల్ ప్రెసిడెంట్ కుమార్, మున్సిపల్ కాంగ్రెస్ పారీ వైస్ ప్రెసిడెంట్ రజనీదేశప్ప, దివాకర్, సుమన్, వెంకటేష్, మహేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం: జగపతి

ప్రజాశక్తి - పలమనేరు: కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపడితేనే సామాజిక న్యాయం జరుగుతుందని చిత్తూరు ఎంపీ అభ్యర్థి ముట్టుకూరి జగపతి అన్నారు. శుక్రవారం ఆయన పలమనేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీకి రావలసిన ప్రత్యేక హోదా తాము

అధికారంలోకి రాగానే వచ్చి తీరుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తేల్చిచెప్పారు. రాష్ట్రానికి రావలసి నిధులు, నియమకాలను తీసుకొస్తామని, ప్రజలంతా ఏకమై కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని కోరారు.

నిర్భయంగా ఓటు వినియోగించుకోండి: డీఎస్పీ

ప్రజాశక్తి-రామకుప్పం: రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటరు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హకు కును వినియోగించుకోవాలని కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ కోరారు. చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశానుసారం శుక్రవారం కుప్పం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనాథ్, కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, రామకుప్పం ఎస్సై శివకుమార్ తమ సిబ్బందితో కలిసి మండలంలో క్రిటికల్ విలేజెస్ అయిన బల్ల గ్రామములో అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఓటరుకు మేము ఉన్నాం అని భరోసాను కల్పిస్తూ, ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా ఎన్నికల ప్రక్రియకు ఏమైనా ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీదే ఘనవిజయం: మాజీ మంత్రి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధిస్తుందని మాజీమంత్రి ఎన్.అమర్నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టపల్లె, చెన్నారెడ్డి పల్లెలలో మండల క్లస్టర్ యూనిట్ బూత్, సెక్షన్ ఇన్‌ఛార్జ్‌ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సన్నద్ధతపై సూచనలు, సలహాలు చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యవస్థల్లో, విధానాల్లో మార్పు కోరుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించబోతుందన్నారు. మన యువత భవితకు కావాల్సిన నమ్మకం, భరోసాని ఈ జగన్ రెడ్డి ఈ జన్మకు ఇవ్వలేడని రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశాడని, ఒకటో తారీఖు నాటికి ఎవరికీ జీతాలు, పింఛన్‌లు అందడం లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పింఛన్ దారులకు, ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ఆనంద్, చలపతి, మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగప్ప, వేమారెడ్డి, నాగరాజా, నాగరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

మండలంలోని పలువురు వైసీపీ నేతలు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ మేరకు పార్టీలో చేరిన వారిలో కరసనపల్లె మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, మణి, మాజీ ఇంటలిజెన్స్ అధికారి సుబ్రహ్మణ్యంరెడ్డి, గోనమకులపల్లి మణి, మునెప్ప పలువురు చేరారు.

చంద్రశేఖర్ మృతికి నివాళి

మండలంలోని బట్టందొడ్డికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ మృతికి మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి నివాళులర్పించారు. గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చంద్రశేఖర్ శుక్రవారం మృతిచెందారు. దీంతో మండల టిడిపి నాయకులతో కలిసి మాజీ మంత్రి, మాజీ ఎంపీపీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలు చంద్రశేఖర్ భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.